# స్వయంవరం

ఐదుగురూ యువకులే!

ఐదుగురూ పాతికేళ్ళ లోపువాళ్ళే!

ఐదుగురూ ధనవంతులే!

ఐదుగురి దగ్గరా ఐదు శుభలేఖ లున్నాయ్!

ఐదుగురూ నిస్పృహగా పడివున్నారు!

ఒకే రకమైన వింత జబ్బుతో బాధపడ్తున్నారా ఐదుగురుయువకులు. భావకవి భద్రం చూచిచూచి బరువుగా నిట్టూర్చాడు. బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు. శుభలేఖను చదివి కిటికీలోనుంచి అవతలికి పారేశాడు. "హా! స్వప్న సుందరీ! ప్రాణేశ్వరీ! నెచ్చెలీ" అంటూ పాలిపోయిన ముఖంతో పడకకుర్చీలో పడిపోయాడు.

కాలిపోతున్నది కామేశం హృదయం. శుభలేఖలోని పెద్ద అక్షరాల దగ్గర్నుంచి మొదలెట్టాడు: చి. సౌ. వసంతను- చి. శేఖర్ : **M. Sc.**, కి ఇచ్చి వివాహము జరుగునటుల... కలవరపడ్డాడు. ఇక చదవలేకపోయాడు. కాళ్లు గట్టిగా బల్లకేసి తన్నాడు. కసకస నలిపి శుభలేఖను చిత్తుకాగితాల బుట్టలో పారేశాడు. కాళ్ళు తడబడి పక్కన మంచంమీద కదలకుండా పడిపోయాడు కామేశం. అర్ధనిమీలిత నేత్రాలతో గోడకు చేరబడ్డాడు ఆనందం. అల్లాగే ఓపికగా

'చి. సౌ. వసంతను–శేఖర్–కు ఇచ్చి,...' అంతే బ్రేకుపడి పోయింది ఆనందం గొంతు. అడుగులో అడుగేసుకుంటూ 'జగమే మాయ' అంటూ నిట్టూర్చుతూ అలమరా దగ్గర అల్లాగే వాలిపోయాడు.

పళ్లు పటపట లాడించాడు పరశురామ్. 'చి. సౌ. వసంత... శేఖర్' పర పర చింపేశాడు శుభలేఖ. పళ్ళు బిగించి ఘట్టిగా కొట్టుకున్నాడు నుదుటిమీద చేత్తో. పసిపిల్లా డిలా ఏడుస్తూ, పనసతొనలు పెట్టివున్న పళ్లెంమీద విరుచుకు పడ్డాడు.

సూదులతో పొడిచినట్టుగా తన్నుకులాడాడు సూర్యం. శుభలేఖను మడిచి పక్కన పారేశాడు. సురసుర కాలి పోతున్నట్టనిపించింది అతని హృదయం. ఉసూరుమంటూ 'వసంతా'! అని వినిపించనంత నెమ్మదిగా అంటూ చూస్తూండగానే స్థూలకాయుడు సూర్యం బల్లమీద ముందుకు ఒరిగిపోయాడు.

భద్రం నాన్న భయపడిపోయాడు !
కామేశం తండ్రి కలవరపడ్డాడు !
ఆనందం అయ్యకు అంతు పట్టలేదు !
పరశురామ్ తండ్రి పని అయిపోయింది !
సూర్యం బాబు సొలిపోయాడు !
దీని కంతటికీ కారణం... ?

వసంత !

మూడురోజుల క్రిందట......

సాయంత్రం 5 గం॥ కావొస్తోంది. బీచ్ ఒడ్డున ఆతురతగా అటూ ఇటూ తిరుగుతున్న ఓ యువతికి ఓ యువకుడు ఎదురుపడ్డాడు. ఆ యువతి సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా వుంది.

యువకుడే మొదట పలకరించాడు.

"మీరు దేనికోసమో వెతుకుతున్నట్టుంది."

ఆశగా చూచింది యువతి. "ఆ! హాండ్ బాగ్ పోయింది"

యువకుడు సూటు జేబులోంచి ఓ చిన్న హాండ్ బాగ్‌ను ఇవతలకు తీశాడు. యువతి కండ్లు ఆనందంతో మెరిశాయి.

"ఇదేనా ?" వినయంగా అడిగాం.

"ఆ! అదే !" ఆతురతగా చెప్పింది.

హాండ్ బాగ్ తీసుకుంటూ ఆమె అంది :

"థాంక్స్! మీ పేరు ?"

"భద్రం! అసలు రామభద్రం. మా ఫ్రెండ్స్ భావకవి భద్రం అంటారు!" ఆ యువకుడు గర్వంగా చెప్పాడు.

"మీ పేరు ?" అత డడిగాడు.

"వసంత ! మీకు దొరకబట్టి సరిపోయింది. చాలా థాంక్స్. అప్పుడప్పుడూ అలా మా ఇంటికి వస్తూండండి" వసంత చిరునవ్వు నవ్వుతూ అంది. పళ్ళు ముత్యాల్లా మెరిసి పోయినాయ్.

"ఏ స్ట్రీట్‌లో వున్నారు మీరు ?" భద్రం నెమ్మదిగా ఆమెపక్కన నడుస్తూ అడిగాడు.

'గవర్నరుపేట."

"ఇంటినంబరు ?"

చెప్పింది వసంత.

భద్రం నోట్ చేసుకున్నాడు.

"మరి గుడీవెనింగ్..." వసంత కారు స్టార్ట్ చేసింది.

భద్రం భావ ప్రపంచంలో మునిగిపోయాడు.

*   *   *   *

"ప్లీజ్ ! ఈ కారును కాస్త స్టార్ట్ చెయ్య గలరూ......?"

మధురమైన కంఠస్వరం విని కామేశం, ఆనందం అదిరి పడ్డారు. వసంతనుచూచి వాస్తవ ప్రపంచంలో పడ్డారు.

"అల్లాగే" అనుకోకుండా ఇద్దరూ జవాబిచ్చారు. కారుదగ్గరికి వచ్చారు.

కాస్సేపట్లో కారు స్టార్టయింది.

"థాంక్స్! చాలా పొద్దుపోయింది!" వసంత మృదువుగా అంది.

"జాగ్రత్తగా వెళ్ళండి! చీకటిపడ్తోంది" ఆనందం అందిచ్చాడు.

"ఫర్వాలేదులెండి" వసంత గొంతు కితకితలుపెట్టింది.

"ఇంతకూ ఎక్కడికి కెళ్ళాలనో...?" కామేశం కళ్ళు తిప్పుతూ అడిగాడు.

"గవర్నరుపేట. లాయర్ రంగనాథం మా ఫాదర్..." వసంత పూర్తిచేసేలోపల అందుకున్నాడు ఆనందం.

"చలపతిరావు మీ బ్రదర్ అనుకుంటాను. నా డియరెస్ట్ ఫ్రెండు కూడాను."

"అలాగా! మీ పేరు...?"

"ఆనంద్" గర్వంగా అన్నాడు. "B. Sc., ఆనర్సు చదువుతున్నాను. ఇతను మా క్లాస్‌మేట్ కామేశం. చలపతిరావుకూడా తెలుసు." "ఇలా ఫ్రెండ్స్ అందరం కలుసుకున్నామన్నమాట" వసంత కిలకిల నవ్వుతూ కొరకొర చూస్తున్న కామేశంవేపు తిరిగింది. ఐసయిపోయాయి కామేశం కండ్లు.

"వెళ్తాను..." జవాబు ఆశించకుండా కారు కదిలిపోయింది. స్నేహితులిద్దరూ ఒకరివేపు ఒకరు చూచుకున్నారు వింతగా.

* * * *

సెకండ్ షో. ఇంటర్ వెల్ లో లైట్లు వేశారు. వసంతకు కుడివైపు అన్నయ్య చలపతి కూర్చున్నాడు. హఠాత్తుగా ఓ చెయ్యి చలపతి భుజంమీద తట్టింది. చలపతి వెనక్కు తిరిగి "ఓ, నువ్వా సూర్యం! రా, ఇలా కూర్చో. నేనసలు చూణ్ణేలేదు."

సూర్యం చలపతిపక్క కుర్చీలో కూర్చున్నాడు.

"వీడు నా ఫ్రెండ్ సూర్యం వసంతా! M. A. చదువుతున్నాడు. ఈవిడ మా చెల్లెలు వసంత. B. A. చదువుతోంది."

వసంత, సూర్యం ఒకరినొకరుచూస్తూ అభినందించుకున్నారు.

"ఈ మధ్య బొత్తుగా రావటమే మానేశావ్ ?"

చలపతి ప్రశ్నకు సమాధానం సూర్యం నోట్లో కాదుగదా మనస్సులోగూడా లేదు. అతని మనస్సు చలపతికి ఇంత అందమైన చెల్లెలుందని తనకు తెలీదే అని చింతిస్తోంది.

పిక్చర్ మళ్లీ బిగిన్ చేశారు.

సూర్యం పిక్చరే చూళ్ళేదు.

హాలునుంచి బయటికివస్తూ "రేపు రారా! సూర్యం!" అన్నాడు చలపతి.

"తప్పకుండా"

"నమస్తే మిస్ వసంతా!" సూర్యం తప్పనిసరిగా విధిలేక వెళ్లాడు.

సూర్యం వెళ్ళిన పదినిమిషాలదాకా రష్ తగ్గలేదు.

"హల్లో వసంతకుమారీ! మీరిక్కడికి వచ్చారు. నేను గమనించలేదు సుమండీ!" ఒక వ్యక్తి వసంత పక్కకు వస్తూ అన్నాడు.

ఆశ్చర్యంగా చలపతి అతనివేపు చూచాడు.

"వారు మీ..." అతను పూర్తిచేసే లోపలే అందుకుంది వసంత.

"...బ్రదర్! వీరు 'పరాజయం' నాటకంలో కాలేజిలో నాతోపాటు యాక్టు చేసిన పరశురాంగారు అన్నయ్యా. నా క్లాస్‌మేట్ కూడాను."

"అలాగా..." చలపతి షేక్‌హాండ్ ఇచ్చాడు.

"ఈ రోజు చాలామంది ఫ్రెండ్సును కలుసుకున్నాను" చలపతి అన్నాడు.

"ఒక్కొక్క రోజు అలా వుంటుంది. రష్ తగ్గింది. వెళ్దామా?" పరశురామ్ వసంతవేపు చూస్తూ అన్నాడు.

"మా కారులో పోదాం రండి. ఎటూ అటువేపే వస్తారుగా!" వసంత స్నేహంగా అంది. కారు కదిలింది.

*  *  *  *

రెండో రోజు...

పొద్దున 7 గం॥ లప్పుడు వసంత గేటుదగ్గర పూలచెట్ల దగ్గర తిరుగుతోంది తోచక.

"నమస్తే వసంతాదేవీ !..." వులిక్కిపడింది వసంత.

ఓ చిన్న పుస్తకం చేతపట్టుకుని భద్రం గేటుదగ్గర కని పించాడు. విస్తుపోతూ ఆహ్వానించింది వసంత.

"భావకవినికాదూ మరి. వినేవాళ్ళున్నారని తెలిస్తే మహోఇదిగా వస్తుంది కవిత్వం. మీకు వినిపిద్దామని వచ్చాను. ఏమంటారు ?" ఊపిరి పీల్చుకోటానికి ఆగాడు భద్రం.

"ఊ ! కానీండి. మొదటలా లోపలికివెళ్లి కూచుం దాం రాండి" తప్పదురా భగవంతుడా అనుకుంది వసంత. కాఫీ తాగారు ఇద్దరూ. ఓ సుందరిని గురించిన కవిత్వం విని పించాడు భద్రం.

సరిగ్గా వినకపోయినా "ఫస్టుక్లాస్‌గావుంది" అని వది లించుకుందామని అంది వసంత. మహా ఆనందంతో మళ్లీ వస్తానని వెళ్లాడు భద్రం. భారం తీరినట్టుగా సంతోషించింది వసంత.

* * *

9 గం॥ల ప్రాంతంలో జడల్లుకుంటున్న వసంత వాకిటి కర్టెన్ కదులుతుండటం చూచి బయటికి వచ్చింది రూంలోంచి.

కామేశాన్ని చూచి ఆశ్చర్యపడింది.

"మీరు......"

"...మీకోసమే వచ్చాను. ఏమీ తోచలేదు సుమండీ! అలా వెళ్తే మా రూమ్‌మేట్స్ ఎవ్వరూ లేరు. మరి తోచక ఇలా వచ్చేశాను."

"మంచిపని చేశారు లెండి"...

పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

10 గం॥ల ప్రాంతంలో మీల్స్ వేళయిందని లేచింది వసంత. కదలక తప్పలేదు కామేశానికి.

ఆనందంగా ఈలవేస్తూ "చలపతిరావూ!" అంటూ వచ్చాడు ఆనందం. 2 గం॥ లయుంటుంది.

"ఎవరూ ?..." ఆశ్చర్యంతో అట్టిట్టయింది వసంత.

"లేడండీ! తెల్లవారుఝామున అర్జంటు పనిమీద వైజాగ్ వెళ్లాడు."

"అరె! నాకు తెలీదు. అయినా ఏదో ఓలా పొద్దు పుచ్చుకోవాలికదా మరి. మీ కిప్పుడేం బిజీ వర్క్ లేదనుకుంటా" ఆనందం ఆప్యాయంగా ఆమెవేపు చూచాడు.

"ఊహు..." అప్రయత్నంగా వచ్చింది వసంతకు.

అతన్ని అవతలకు పంపించేసరికి 5 గం॥ లయింది.

ఇదేం ఖర్మంరా అనుకుంటున్న వసంతకు ప్యూన్ మల్లయ్య వచ్చి చెప్పాడు. ఎవరో ఇద్దరు మీకోసం వచ్చారంటూ!

హతాశురాలైంది వసంత.

అప్పుడే వాళ్ళు లోపలికి రానే వచ్చారు.

పరశురామ్, సూర్యం.

"చలపతి వూరి కెళ్లాడటగాదండీ వసంతకుమారీ!" సూర్యం అన్నాడు.

"ఏమిటి మీ బ్రదర్ వూళ్లో లేరూ! ప్చ్!" పరశురామ్ డ్రామాలో యాక్ట్ చేస్తున్నట్టుగా అన్నాడు.

"వెళ్ళొస్తామయితే ఇంకెందుకూ" సూర్యం వెనక్కు తిరిగాడు.

"కాస్సేపు అలా ఏదైనా మాట్లాడిపోదామండీ! ఎటూ వచ్చాంగాదూ!" పరశురాం అన్నాడు.

"కాఫీతాగి వెళుదురుగాని" వసంత గొంతు నూతిలో నుంచి మాట్లాడినట్టుంది.

ఇద్దరూ ఇంటినుంచి కదిలేసరికి 7 గంటలయింది.

తలనొప్పిగా వుందని వసంత భోజనమయినా చెయ్యకుండా, మళ్ళీ ఎవరొస్తారోనని మేడమీదికెళ్ళి పడుకుంది.

*　　*　　*　　*

వసంతను చూడంది బ్రతకలేననుకున్నాడు భద్రం!

వసంత వల్లే తను కాళ్ళూ చేతులూ కదల్చగల్గుతున్నాననుకున్నాడు కామేశం!

వసంత లేనిది జీవితంలో అందం లేదనుకున్నాడు ఆనందం !

వసంతను తల్చుకుంటూ పరవశమౌతున్నాడు పరశురామ్ !

వసంత లేని బ్రతుకులో సొగసే లేదనుకున్నాడు సూర్యం !

*  *  *  *

ఆరోజు...

రోజూ కంటే అందంగా అగుపించింది వసంత !

పైగా మిత్రులందరూ ఒకేసారి వచ్చారు !

చాలామంది యువతులు కూడా వచ్చారు.

చిరునవ్వు వెదజల్లుతోంది వసంత ముఖం.

స్వయంగా ఐదుగురి మధ్యకూ వచ్చి అందిచ్చింది తలా ఒక శుభలేఖ.

భద్రం బిక్కపోతూ బయటికి వచ్చాడు.

కామేశం కాలుగాలినపిల్లి లా పరుగెత్తాడు.

ఆనందం ఆనందవిహీనంగా బయటపడ్డాడు.

పరశురామ్ పాలిపోయిన ముఖంతో వెళ్లాడు.

సూర్యం సురసుర దహించుకుపోతూవచ్చాడు.

అంతే ! అదే ఈనాటి ఈ దుర్ఘటనకు కారణం !